క్లుప్తంగా

గడువు పొడిగింపు

రామగిరి(నల్లగొండ): ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ ప్రత్యేక అడ్మిషన్ల దరఖాస్తు గడువు ఈ నెల 30 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ బాలుర బాలుర ఉన్నత పాఠశాల కోఆర్డినేటర్ ఎండీ యూసఫ్‌దీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్ ప్రవేశం కోసం టీసీ, కుల ధృవీకరణ పత్రం, 2 పాస్ ఫొటోలు, ఇంటర్ అడ్మిషన్ కోసం టెన్త్ మార్కుల జాబితా, టీసీ, కుల ధృవీకరణ పత్రం, ఆధార్ కార్డ్, 2 పాస్ ఫొటోలు అవసరమన్నారు. పూర్తి వివరాలకు సెంటర్ కోఆర్డినేటర్ 7981098521 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్‌కు జాతీయ పురస్కారం

నకిరేకల్ : వివిధ వర్గాలవారికి విశేష సేవలు అందిస్తున్న నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్.. పుడమి రత్న జాతీయ సేవా పురస్కారానికి ఎంపికైంది. ఈమేరకు పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుమల బాల్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆరు సంవత్సరాలుగా చిన్నారుల వైద్యానికి సహాయం చేయడం, నిరుద్యోగులకు ఉచితంగా స్టడీ హాల్, అనాథాశ్రమాలకు చేయూత, నిరుపేదలకు జీవనోపాధి కల్పన, రక్తదానం వంటి పలు సేవా కార్యక్రమాలు చేస్తుండడంతో పురస్కారానికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 29న ఖమ్మంలో జరిగే కార్యక్రమంలో నకిరేకల్ లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ వారు పురస్కారాన్ని అందుకోనున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్ మాట్లాడుతూ అందరి సహకారంతోనే తమ ఫౌండేషన్‌కు జాతీయ పురస్కారం లభించిందన్నారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

నార్కట్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 50 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శుక్రవారం నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

శివుడికి అభిషేకం



అభిషేకం చేస్తున్న భక్తులు

రామగిరి (నల్లగొండ): సఫల ఏకాదశి సందర్భంగా గురువారం పానగల్‌లోని శంకర గోశాలలో ఆలయ అర్చకులు ఫణీంద్ర శర్మ, శ్రవణ్ శివుడికి అభిషేకం, లక్ష్మీనరసింహస్వామికి సుదర్శన హోమం, స్వామివారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గణేశ్, హరి, శ్రీనివాస్, ప్రవళిక భక్తులు పాల్గొన్నారు.

లింక్ రోడ్లను అభివృద్ధి చేయాలి

చండూరు: లింక్ రోడ్లను అభివృద్ధి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జేర్రిపోతుల ధనంజయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం నెర్మట-శేరిగూడెం గ్రామాల మధ్యగల లింక్ రోడ్డును సీపీఎం నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. సీపీఎం నాయకులు ఈరటి వెంకటయ్య, బల్లెం స్వామి, బొమ్మగోని యాదయ్య, పండు, శ్రీశైలం, రాములు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

నకిరేకల్ : తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకుండా నకిరేకల్ సీఐ తిరిగి తనపై కేసు నమోదు చేశారని ఆరోపిస్తూ తాటికల్ గ్రామానికి చెందిన ముచ్చపోతుల వెంకన్న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశానని గురువారం తెలిపారు. ఈ విషయంపై తనకు న్యాయం చేయాలని కోరారు.

నేత్రాల సేకరణ

నల్లగొండ టౌన్: నల్లగొండ మండలం పగిడిమర్రికి చెందిన బిక్కుమల్ల లింగమ్మ అనే వృద్ధురాలు బుధవారం మృతి చెందింది. విషయం తెలిసిన డాక్టర్లు హరనాథ్, పుల్లారావు బుధవారం రాత్రి లింగమ్మ కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా సంప్రదించి వారి అనుమతితో లింగమ్మ నేత్రాలను సేకరించారు.

దుప్పట్ల పంపిణీ

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధిలో గల సాయిబాబా ఆలయం సమీపంలో పలువురు యాచకులకు గురువారం ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇమ్మడి వెంకటేశ్వర్లు, గడగోజు ఎల్లాచారి, జాల నరేష్, ఓర్సు శ్రీధర్, అంజనపల్లి శివసాయి పాల్గొన్నారు.

చార్లెస్ బాబేజ్‌కు నివాళి

చిట్యాల: కంప్యూటర్ పితామహుడు చార్లెస్ బాబేజ్ జయంతిని గురువారం చిట్యాల పట్టణంలోని సిట్ సొల్యూషన్స్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో నిర్వహించారు. శిక్షణ సంస్థ డైరెక్టర్ గంజి శ్రీరామ్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. చార్లెస్ బాబేజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గట్టోజు యశ్వంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సేవలు అందేనా !

- గట్టుప్పల్‌లో పీహెచ్‌సీ భవనానికి రూ.కోటి 43 లక్షలు మంజూరు
- ఎనిమిది నెలలైనా ప్రారంభం కాని పనులు
- భవన నిర్మాణానికి స్థలం చూపించని అధికారులు
- వైద్యానికి పక్క మండలాలకు వెళ్తున్న ప్రజలు



గట్టుప్పల్‌లోని హెల్త్ సబ్ సెంటర్

చండూరు(గట్టుప్పల్) : దేవుడు వరమిచ్చినా..పూజారి కనికరించడం లేదు అనే చందంగా మారింది గట్టుప్పల్‌కు మంజూరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం నిర్మాణ పరిస్థితి. నూతనంగా ఏర్పాటైన గట్టుప్పల్ మండలంలోని ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులో తెచ్చేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ప్రభుత్వం 8 నెలల క్రితం రూ.కోటి 43 లక్షలు మంజూరు చేస్తూ జీఓ విడుదల చేసింది. భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం చూపించాల్సిన రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. నూతన మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా ప్రభుత్వ ఆస్పత్రి లేక మెరుగైన వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రస్తుతం హెల్త్ సబ్ సెంటర్ మాత్రమే గట్టుప్పల్‌లో అందుబాటులో ఉంది. ఇందులో ముగ్గురు ఏఎన్‌ఎంలు ఉన్నారు. అధికారులు వెంటనే స్పందించి ప్రభుత్వ స్థలం చూపించి ఆస్పత్రి నిర్మాణ పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ సేవలు మాత్రమే..

గట్టుప్పల్ మండల పరిధిలో వెల్మకన్నె, గట్టుప్పల్, తేరట్‌పల్లి, ఖమ్మగూడెం, శేరిగూడెం, అంతంపేట, నామాపురం గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గట్టుప్పల నూతన మండలంగా ఏర్పాటై రెండు సంవత్సరాలు కావొస్తున్నా ప్రజలకు పూర్తిస్థాయి అన్ని ప్రభుత్వ శాఖల సేవలు అందడం లేదు. పోలీస్, మండల పరిషత్ సేవలు నేటికీ కొలిక్కి రాలేదు. రెవెన్యూ సేవలు మాత్రమే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మిగతా ప్రభుత్వ శాఖల సేవలు పాత మండలాల పరిధిలో అందుతున్నాయి. మండల పరిషత్ ఏర్పాటు ఏర్పాటుకు ఇటీవల ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గట్టుప్పలలో అన్ని శాఖల ప్రభుత్వ భవనాలు నిర్మించి ఇబ్బందులు తీర్చాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

పీహెచ్‌సీ భవనం నిర్మించాలి



గట్టుప్పల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి స్థలం సేకరించి వెంటనే భవన నిర్మాణ పనులు చేపట్టాలి. వైద్యం కోసం మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మెరుగైన వైద్య సేవలకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది.

–కర్నాటి మల్లేశం, గట్టుప్పల మండలం

త్వరలో స్థలం గుర్తిస్తాం



సర్వేయర్ లేకపోవడంతో గట్టుప్పల్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి స్థలం గుర్తించడంలో కొంత ఆలస్యం జరిగింది. త్వరలో స్థలం గుర్తించి సంబంధిత అధికారులకు అందజేస్తాం. ఇప్పటికే ప్రభుత్వ స్థలం ఎక్కడ ఉందో పరిశీలించాం.

–రాములు, గట్టుప్పల్ తహసీల్దారు

పెండింగ్ కేసులు పరిష్కరించండి



తిప్పర్తి పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

తిప్పర్తి : పెండింగ్ కేసులన్నీ వెంటనే పరిష్కరించేవిధంగా చర్యలు చేపట్టాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. గురువారం తిప్పర్తి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలను పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్‌ఐ సాయి ప్రశాంత్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణ చర్యలు తీసుకోవాలి

కట్టంగూర్ : జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. గురువారం కట్టంగూర్ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ ఎం.రవీందర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

29న బ్రాహ్మణ మహా సమ్మేళనం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

రామగిరి(నల్లగొండ): హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ బ్రాహ్మణ అఫీషియల్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించనున్న బ్రాహ్మణ మహా సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు కోరారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం రామగిరిలోని శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంచనపల్లి రాజేంద్ర ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు సిరిప్రగడ శ్రీనివాస శర్మ, జిల్లా కోశాధికారి రంగరాజు జగదీష్ శర్మ, గాదె మురళి, సుదర్శనచార్యులు, చరణ్ శర్మ, రామరాజు శరత్, నేవర్సు నీరాజ, నరసింహారావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మండల పూజ



కట్టంగూర్ : అయ్యప్ప స్వామికి అభిషేకం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రామగిరి(నల్లగొండ): అన్నదానం చేస్తున్న వెంకన్న-అరుణ దంపతులు

కట్టంగూర్ : మండల కేంద్రంలోని శ్రీసాయిమణికంఠ ఆలయంలో గురువారం అయ్యప్పస్వామి 15వ మహా మండల పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి కొటారు సత్యనారాయణశర్మ, గురుస్వాములు వంగూరి లక్ష్మయ్య, గాదగోని వెంకన్న ఆధ్వర్యంలో గణపతి హోమం, అభిషేకాలు, దీపారాధన, పుష్పాలంకరణ, మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, కాంగ్రెస్ నాయకుడు దైద రవీందర్ వేర్వేరుగా పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీపీ, ఆలయ శాశ్వత చైర్మన్ జెల్లా ముత్తిలింగయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు పోగుల నర్సింహ, కోశాధికారి గుడిపాటి శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి పొట్టబత్తుల కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నూక సైదులు, కానుగు లక్ష్మీనారాయణ, కొంపెల్లి నర్సింహ, మండల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నిత్య అన్నదానం చేయడం అభినందనీయం

రామగిరి (నల్లగొండ): నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని విజిలెన్స్ డీఎస్పీ రవీందర్ అన్నారు. గురువారం నల్లగొండలోని పద్మావతి కాలనీలో 41 రోజులుగా అయ్యప్ప మాలధారులకు నారాయణదాసు వెంకన్న-అరుణ దంపతులు అన్నదానం చేస్తున్నారు. గురువారం అయ్యప్ప మాలధారుల దీక్ష ముగింపు సందర్భంగా అన్నదాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం వెంకన్న దంపతులను డీఎస్పీ, గురుస్వాములు సన్మానించారు. కౌన్సిలర్ వేణుగోపాల్‌రెడ్డి, గురుస్వాములు మారోజు కాళిదాసు, మాచర్ల శ్రీనివాస్, మోత్కూరు బ్రహ్మచారి, నరసింహ, సంజీవ, మల్లన్న, అశోక్, నవీన్, సైదులు, అఖిల్, అరుణ, శోభ, రజిత, రేఖ, చంద్ర, మణికుమార్, మోక్షిత్ పాల్గొన్నారు.

గరుడ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం



గరుడ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి : మండలంలోని శాపల్లి గ్రామంలో గల శ్రీ కమలాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో గురువారం గరుడ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. యాదగిరిగుట్ట ఆలయ విశ్రాంత ప్రధాన అర్చకులు, ఆలయ అనువంశిక అర్చకులు కారంపూడి నర్సింహాచార్యులు, రాకేశాచార్యులు, అర్చక బృందంతో కలిసి వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు, కళాన్యాస హోమం నిర్వహించి గరుడ స్తంభ ప్రతిష్ఠాపన చేశారు. గరుడ స్తంభాన్ని వనపర్తి వాస్తవ్యులు డాక్టర్ మారేడు వెంకటసురేశ్-కల్యాణలక్ష్మి దంపతులు సొంత ఖర్చులతో ప్రతిష్ఠించినట్లు అర్చకులు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ కూడా మారేడు వెంకటసురేశ్ దంపతులు నిర్వహించారు. వేడుకల్లో మాజీ సర్పంచ్‌లు సిద్దగోని స్వామి, కర్నాటి ఉపేందర్, మాజీ ఉప సర్పంచ్ నిమ్మనగోటి వెంకన్న, గోలి సాగర్‌రెడ్డి, కర్నాటి నర్సయ్య, కుందూరు విద్యాసాగర్‌రెడ్డి, కన్నెబోయిన స్వామి, జల్ల ముకుందం, వెంకన్న, రామలింగయ్య, బాషపాక స్వామి తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల పక్షపాతి సీపీఐ

- ఘనంగా పార్టీ శత వార్షికోత్సవం
- జెండాలు ఎగురవేసిన నాయకులు



మునుగోడు : జెండా ఎగురవేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం



చిట్యాల : సీపీఐ జెండా ఎగురవేస్తున్న శ్రవణ్‌కుమార్

మునుగోడు: పీడిత ప్రజల, రైతు, కార్మికవర్గాల పక్షపాతిగా నిలబడి అసమాన త్యాగాలతో సీపీఐ పార్టీ నిర్మితమైనదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ వందేళ్ల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం మునుగోడులోని పార్టీ కార్యాలయం ఎదుట సీపీఐ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి, భూస్వామ్య, పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతున్న పార్టీ సీపీఐ అన్నారు. భూ సమస్యలే ఎజెండాగా అనేక ఉద్యమాలు చేసి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి లక్షల ఎకరాలు పంచిపెట్టిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుర్జ రామచంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్గూరి నర్సింహ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తిరిపారి వెంకటేశ్వర్లు, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, సురిగి చలపతి, బి.లాలు, యాదయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన నిరంతరం పోరాడుతాం

చిట్యాల: పేద ప్రజల పక్షాన సీపీఐ నిరంతర పోరాటాలు చేస్తోందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ అన్నారు. సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా చిట్యాలలో గురువారం పార్టీ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీట్లు, ఓట్లతో సంబంధం లేకుండా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా సీపీఐ నాయకులు, కార్యకర్తలు రాజకీయాలు కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎండీ.అక్బర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు జహంగీర్, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎస్‌కె.షరీఫ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు బొల్గూరి లింగయ్య, దండిగ నర్సింహ, గుండాల సత్తయ్య, దేశగోని బాలరాజు, దేవేందర్, అంజయ్య పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో గురువారం సీపీఐ జెండాను పార్టీ మండల కార్యదర్శి పెండ్యాల శంకర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల మాజీ కార్యదర్శి వెంపటి శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్, తోడుసు సైదులు, సీలోజు వెంకటయ్య, బోడ మల్లేష్, మల్లయ్య, నర్సింహ, స్వామి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి : సీపీఐ ఏర్పడి వంద సంవత్సరాల అవుతున్న సందర్భంగా నాంపల్లి మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.అంజయ్య గురువారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, ఊరుపాక వెంకటేష్, నేతాల్ల రాజు, ముదిగొండ మురళీకృష్ణ, దండిగ వెంకటయ్య, సత్తయ్య, గిరి, స్వామి, ప్రశాంత్, మహేష్, రవి పాల్గొన్నారు.

మర్రిగూడ : సీపీఐ శత వార్షికోత్సవాలను గురువారం మర్రిగూడ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బూడిద సురేష్, బుర్ర శేఖర్, ఆకుల రఘుమయ్య, ఎరుకల నిరంజన్, కూన్‌రెడ్డి గిరి, అయితగోని వెంకటయ్య, ఇస్కల్ల మహేందర్, జక్కల అంజయ్య, మాదగోని నరసింహ, ఈద మారయ్య, కర్నాటి అంజయ్య, జిల్లా బాలకృష్ణ, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి : జెండా ఆవిష్కరిస్తున్న శంకర్

కనగల్: మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్‌లో గురువారం సీపీఐ 100వ సంవత్సర ఆవిర్భావ వేడుకలను పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, దోటి పాండరి, జోగు సురేందర్, జినుకుంట్ల లింగయ్య, జినుకుంట్ల ఆంజనేయులు, తొరకొప్పుల నాగయ్య, నరసింహ, ఎల్లయ్య పాల్గొన్నారు.



కనగల్: జెండా ఎగురవేస్తున్న నాయకులు



నాంపల్లి మండలంలో..



మర్రిగూడ : జెండా ఎగురవేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ

నల్లగొండ: కాంగ్రెస్ పార్టీ నాయకుడు పర్వతం వేణు తండ్రి పర్వతం సూరయ్య ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గురువారం నల్లగొండలో వేణు కుటుంబాన్ని పరామర్శించి సూరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నూక కిరణ్‌యాదవ్, గంట్ల వేణుగోపాల్‌రెడ్డి, రామిడి శ్రవణ్‌రెడ్డి, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, కత్తుల రాంబాబు, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్ధు, పర్వతం శివ, మేడి అశోక్ పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత



నగదు అందజేస్తున్న కొరివి శ్రీనివాస్

కనగల్: మండలంలోని జి.యడవల్లి గ్రామానికి చెందిన కొప్పుల రమేష్-స్వరూప కుమారుడు నిఖిల్‌కు వారం క్రితం కంటిలో గాజు ముక్క గుచ్చుకుంది. నిఖిల్‌ను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. నిఖిల్ తల్లిదండ్రులు పేదవారు కావడంతో గ్రామస్తులు వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా విరాళాలు సేకరించి వచ్చిన రూ.22,400 మొత్తాన్ని గురువారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో యడవల్లి యూత్ ఫౌండర్ కొరివి శ్రీనివాస్, యూత్ సోషల్ మీడియా కన్వీనర్ భోగరాజు శ్రీను పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న చింతకాయల పుల్లయ్య, క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి

నల్లగొండ టూటౌన్ : హన్మకొండలో ఈ నెల 27 నుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనడానికి వెళ్తున్న జిల్లా బాలబాలికల జట్లకు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య సహకారంతో జిల్లా యువజన, క్రీడల అధికారి కుంభం నర్సిరెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా క్రీడల అధికారి ధనుంజయ్య క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కవిత, చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ దరఖాస్తు ఫారాలపై జీఎస్టీ ఎత్తివేయాలి

చిట్యాల: ఉద్యోగ నియామకాల దరఖాస్తు ఫారాలపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ చిట్యాలలో బీఆర్.అంబేద్కర్ విగ్రహానికి గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగులపై పన్ను భారం వేయడం తగదన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు జిట్ట రమేష్, వడ్డెగాని మహేష్, మండల అధ్యక్షుడు పంది నరేష్, అవిశెట్టి కిరణ్, జిట్ట సురేష్, జోగు గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ టౌన్: అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. గురువారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమిత్ షా తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 29న నల్లగొండలో, 30న మండల, పట్టణ కేంద్రాల్లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన ర్యాలీలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సలీం, పి.నర్సిరెడ్డి, దండెంపల్లి సత్తయ్య, శంకరయ్య, రవినాయక్, గౌతంరెడ్డి, వెంకన్న, ఆర్ శ్రీనివాస్, శశిధర్‌రెడ్డి, వినోద్ నాయక్, చంద్రమౌళి, సీహెచ్ బయన్న, మల్లయ్య, జిట్టా సరోజ, నల్ల వెంకటయ్య, సైదులు, నాగరాజు, లూర్దు మారయ్య, లింగస్వామి, భిక్షం సాగర్ల మల్లేష్, ఏర్పుల యాదయ్య, పాల్గొన్నారు.

నూతన బస్సు సర్వీసు ప్రారంభం

చండూరు: దేవరకొండ డిపో నుంచి చండూరు మండలంలోని గుండ్రాంపల్లి, చామలపల్లి గ్రామాల మీదుగా నల్లగొండ జిల్లా కేంద్రానికి నూతనంగా ఆర్టీసీ బస్సు సర్వీసు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా గుండ్రాంపల్లి, చామలపల్లి గ్రామస్తులు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కోరిక మేరకు తమ గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఆయా గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భూతరాజు ఆంజనేయులు, తీగల సుభాష్, కురుపాటి గణేశ్, కాసాల పాండురంగారెడ్డి, భూతరాజు యాదయ్య, కురుపాటి శ్రీను, ఎలువర్తి శ్రీను, రంగారెడ్డి నరేందర్, తిరుమణి శ్రీనివాసులు, సైదులు తదితరులు పాల్గొన్నారు.





ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

నల్లగొండ పట్టణంలోని శివాజీ నగర్ సెంటర్‌లో గల టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉషోదయ చేనేత, హస్తకళా ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంటోంది. పోచంపల్లి బెడ్ షీట్స్, కలంకారి మంగళగిరి చేనేతలు, ఖాదీ వస్త్రాలు, జైపూర్ బెడ్ షీట్స్, బంజారా ఉత్పత్తులు, కొండపల్లి బొమ్మలు, లెదర్ బ్యాగులు గృహోపకరణాలు, బ్యాంగిల్స్, రాజస్థానీ ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారు. –సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ